# పేదల భూములు లాక్కొన్న చరిత్ర జేసీలది

● ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి


జూటూరులో పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**పెద్దపప్పూరు:** పేద రైతులను తమ రాజకీయ పలుకుబడితో బెదిరించి తక్కువధరకే భూములు లాక్కున్న చరిత్ర జేసీ సోదరులదని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం సంక్షేమ పాదయాత్ర రెండో రోజు జే కొత్తపల్లి నుంచి నారాపురం, సోమనపల్లి, తిమ్మన చెరువు, జూటూరు గ్రామాల మీదుగా సాగింది. గ్రామాల్లో అడుగడుగునా ఎమ్మెల్యేకు మహిళలు హారతులిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. జూటూరులో నిర్వహించిన బహిరంగసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో యాడికి మండలం కోనుప్పలపాడు వద్ద త్రిశూల్ ఫ్యాక్టరీ కోసం దాదాపు 1600 ఎకరాలు లీజుకు తీసుకుని ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండానే అక్కడి ఖనిజాన్ని దోచుకున్నారన్నారు. ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకపోవడంతో మైనింగ్ అధికారులు లీజును రద్దు చేసి రూ.100 కోట్లు జరిమానా విధించినా చెల్లించలేదన్నారు. అప్పట్లో టీడీపీ నాయకులు పయ్యావుల కేశవ్, కాలవ శ్రీనివాసులు తదితరులు జేసీ సోదరులు ఖనిజ సంపదను దోచేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేసిన విషయాన్ని ఈనాడు ప్రచురించిందని ఆ పత్రికను ప్రజలకు చూపించారు. కాంగ్రెస్‌లో ఉన్నపుడు దొంగలంటూ ప్రచురించిన ఈనాడుకు జేసీ సోదరులు టీడీపీలో చేరగానే వారికి దొరల్లా కనిపించారా అని ప్రశ్నించారు. తిమ్మనచెరువు, చింతరపల్లి, పెద్దపప్పూరు గ్రామాలకు చెందిన పలుపేదరైతులను తమరాజకీయ పలుకుబడితో బెదిరించి తక్కువ ధరకే భూములు తమపేరున రాయించుకున్న నీచ సంస్కృతి జేసీ సోదరులదన్నారు. తమ ఇలవేల్పు మద్దిలేటమ్మ ఆలయానికి చెందిన భూములు వారి కనుసన్నల్లోనే ఉన్నాయన్నారు. జూటూరులో ఇటీవల జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో అనిల్‌కుమార్ రెడ్డి గెలుపొందడంతో తమ ఉనికిని ఎక్కడ కోల్పోతామని తమ అనుచరులతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రగుడి రామ్మోహన్‌రెడ్డితో పాటు అతని ఇళ్లపై కట్టెలు, రాళ్లతో దాడులు చేయించారన్నారు. రాజకీయంగా ప్రజల్లో నమ్మకం కోల్పోతుండడంతో జీర్ణించుకోలేని జేసీ సోదరులు తమ అనుకూల మీడియా ద్వారా ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆయన ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వేమనాథరెడ్డి, ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, పప్పుక కళావతి, ఎంపీటీసీలు నారాయణ, అనీల్‌కుమార్ రెడ్డి, సర్పంచు నొస్సం అశ్విని, జిల్లా పార్లమెంటు జనరల్ సెక్రటరీ రవి ప్రసాద్ రెడ్డి, సీనియర్ నేతలు నామనాంకపల్లి రఘునాథరెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు హాజీవలి, దబ్బర శ్రీనివాసులు, దబ్బర మోహన్, ఈశ్వరయ్య, రామ్మోహన్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, రవి, జేసీ రంగారెడ్డి, జేసీ విష్ణువర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జేసీ అనుచరులు వైఎస్సార్‌సీపీలోకి చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**పెద్దపప్పూరు:** ప్రజా సంక్షేమపాదయాత్రలో భాగంగా బుధవారం సోమనపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ నేత ఈశ్వరయ్య నేతృత్వంలో జేసీ అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ విజయం కోసం శక్తివంచన లేకుండా చేస్తామని పార్టీలో చేరినవారు పేర్కొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై రేపు ఓటర్లకు అవగాహన

**గుత్తి రూరల్:** పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఓటు నమోదు చేసుకుని జాబితాలో పేర్లు ఉన్న ఓటర్లు కార్యక్రమానికి రావాలని ఎంపీడీఓ సూచించారు.

## కల్లూరు-2 వీఆర్‌ఓ చెన్నారెడ్డి సస్పెన్షన్

**గార్లదిన్నె:** కల్లూరు-2లో వీఆర్‌ఓగా పనిచేస్తున్న చెన్నారెడ్డిని సస్పెండ్ చేసి నట్లు తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్‌ఓ చెన్నారెడ్డి మండల సర్వేయర్ (మహిళ ఉద్యోగి) పట్ల దురుసుగా మాట్లాడినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందిందన్నారు. అధికారులు విచారణ చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు ఇవ్వడంతో వీఆర్‌ఓ చెన్నారెడ్డిని సస్పెండ్ చేశారన్నారు.

## స్కూల్ అసిస్టెంట్‌కు షోకాజ్

**రాప్తాడురూరల్:** గార్లదిన్నె మండలం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచరు కులశేఖర్‌రెడ్డికి విద్యాశాఖ అధికారి సాయిరాం బుధవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈయన ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదులు రావడంతో షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీఈఓ తెలిపారు. ఎన్నికల ప్రచారాల్లో ఉపాధ్యాయులు పాల్గొంటే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## క్లుప్తంగా

### కోటవీధిలో బోరు ఏర్పాటు


బోరు ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్

**గుత్తి:** పట్టణంలోని కోట వీధి(13వ వార్డు)లో బుధవారం నీటి సమస్య పరిష్కారానికి బోరు ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శరత్‌చంద్ర భూమి పూజ చేసి బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బిందె వరలక్ష్మి, పద్మలత రెడ్డి, కౌన్సిలర్ మర్తాడు హసీనా, వార్డు ఇన్‌చార్జ్ మర్తాడు అన్సార్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పీరా, నాయకులు షఫీ, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### కేసు నమోదు

**గుత్తి:** పట్టణంలోని అమృత్ సినిమా థియేటర్‌లో సీసీ కెమెరాను గత ఆదివారం రాత్రి ఎస్సీ కాలనీకి చెందిన సాయి అనే యువకుడు ధ్వంసం చేశాడు. దీంతో థియేటర్ మేనేజర్ మర్తాడు దాదా ఖలందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరామిరెడ్డి తెలిపారు.

### చింతలరాయుడి సన్నిధిలో జడ్జి


స్వామిని దర్శించుకుంటున్న తాడిపత్రి జడ్జి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు

**తాడిపత్రి టౌన్ :** స్థానిక ప్రసిద్ధ చింతల వెంకటరమణస్వామి ఆలయాన్ని బుధవారం తాడిపత్రి మేజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు సందర్శించుకున్నారు. ఆనందవల్లి నాయక సమేతచింతల వెంకటరమణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం శిల్ప సంపదను తిలకించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మురళీస్వామి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

### రవీంద్రారెడ్డిని గెలిపించండి

**పామిడి:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు కోరారు. బుధవారం ఆయన రవీంద్రరెడ్డి తరఫున పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఓటర్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటును ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డికి వేసి భారీ ఆధిక్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు లక్ష్మీనారాయణ, నల్లప్ప, సోమశేఖర్, ధను తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు స్లిప్‌లు వచ్చేశాయ్


ఓటరు స్లిప్‌లు తీసుకుంటున్న బీఎల్‌ఓలు

**యల్లనూరు:** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు స్లిప్‌లు పంపిణీకి సిద్ధమయ్యాయి. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలు ఓటర్ స్లిప్‌లను తీసుకున్నారు. మండలవ్యాప్తంగా పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 713 ఓట్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 23 మంది ఓటరు స్లిప్‌లు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ శ్వేత తెలిపారు. ఈనెల 5 వరకు గ్రామాల్లో బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి స్లిప్పులను పంపిణీ చేస్తారన్నారు.

### నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి

**తాడిపత్రి:** నిరుపేదలు, మాదిగలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నేత తెన్నేటి కిశోర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన అంబేడ్కర్ సర్కిల్‌లోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీబీ రోడ్డు మీదుగా ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయప్రసాద్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు పరమేశు, తాడిపత్రి ఇన్‌చార్జ్ రాజు, శింగనమల ఇన్‌చార్జ్ సింగవరం కుళ్లాయప్ప, యువసేన అధ్యక్షుడు జానీ తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ నాయకుల నిరసన

**తాడిపత్రి టౌన్ :** జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షలతోపాటు సిమెంట్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య, పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్, నాయకులు రామాంజి, నాగరంగయ్య, నాగేంద్ర, సాధక్ వలి, రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి


మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి


ఎమ్మెల్సీ మంగమ్మను సన్మానిస్తున్న నైరుతిరెడ్డి

● ఎంపీ రంగయ్య, ఎమ్మెల్సీ శివరామిరెడ్డిల పిలుపు

**గుంతకల్లుటౌన్:** వైఎస్సార్‌సీపీ తరఫున పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయనున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని అనంతపురం ఎంపీ రంగయ్య, ఎన్నికల పరిశీలకుడు, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కోఆప్షన్‌సభ్యులు, వార్డు సభ్యులు, ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానుద్దేశించి వారు మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు ప్రిలిమనరీ పరీక్షల్లాంటివని ఈ పరీక్షల్లో మనం సత్తా చాటితేనే (మెయిన్‌ఎగ్జామ్) సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 175 స్థానాలు గెలుచుకోవడం సులభమవుతుందన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలంతా సమష్టిగా ఓటర్లను కలిసి గడిచిన మూడున్నరేళ్లలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధికి జగనన్న చేస్తున్న మేలును తెలియజేయాలన్నారు. గత టీడీపీ హయాంలో బాబు వస్తే జాబిస్తానని, లేకపోతే నిరుద్యోగభృతి ఇస్తానన్న చంద్రబాబు మోసాలను వివరించాలని చెప్పారు. ఎన్నికల్లో టీడీపీ నాయకులు విచ్చలవిడిగా డబ్బు వెదజల్లేందుకు యత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఓటర్లను ఆకర్షించేందుకు టీడీపీ చేస్తున్న ప్రలోభాల వలలో చిక్కుకుంటే మన భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని ఓటర్లకు తెలియజెప్పాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, పార్టీ రాష్ట్ర నాయకుడు ఎం.ఆర్‌సీ.రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని పట్టభద్రులు, ఉపాధ్యాయులకు వివరించి పార్టీ తరఫున బరిలో ఉన్న అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరును పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటును వేయించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామలింగప్ప, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, ఎంపీపీలు మాధవి, మురళీరెడ్డి, జెడ్పీటీసీ కదిరప్ప, పార్టీ జిల్లా కార్యదర్శి చిన్నబాబు, సీనియర్ నాయకుడు శ్రీనివాసరెడ్డి, మూడు మండలాల పార్టీ కన్వీనర్లు సుంకప్ప, హుసేన్‌పీరా, మోహన్, గోవర్ధన్‌రెడ్డి, పార్టీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ మంగమ్మకు ఘన సన్మానం**

ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్.మంగమ్మను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు. వీరితో పాటు ఎంపీ రంగయ్య, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలానరసింహయ్యను సత్కరించారు. బీసీలంటే బ్యాక్‌బోన్ క్లాస్‌గా నిరూపించిన ఘనత జగనన్నదేనని చెప్పారు.

# పింఛన్ల పంపిణీ పరిశీలన


అరకటివేములలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎంపీడీఓ యోగానందరెడ్డి

**పుట్లూరు:** మండలవ్యాప్తంగా బుధవారం చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ యోగానందరెడ్డి పరిశీలించారు. అరకటివేముల, సూరేపల్లి, కడవకల్లు తదితర గ్రామాల్లో పర్యటించిన ఆయన పింఛన్ల పంపిణీ వేగవంతంగా చేపట్టాలని వలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**91 శాతం పింఛన్ల పంపిణీ**

**తాడిపత్రి టౌన్:** పట్టణంలో పింఛన్ల పంపిణీ బుధవారం ముమ్మరంగా సాగింది. మున్సిపాలిటీ పరిధిలోని 9,757 మంది పింఛన్‌దారులుండగా సాయంత్రంకల్లా 8,890 మందికి (91.11శాతం) రూ.2,49,21,000 పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. పింఛన్ పంపిణీలో తాడిపత్రి మున్సిపాలిటీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. పింఛన్ల పంపిణీకి సహకరించిన వలంటీర్లు, అధికారులను కమిషనర్ అభినందించారు. ఇదిలా ఉండగా పాతకోటకు చెందిన సిద్దయ్య అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ మోహన్‌కుమార్ అక్కడికెళ్లి పింఛన్ల సొమ్ము అందించారు.

**శింగనమల:** నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం వైఎస్సార్ పింఛన్ కానుక 43,165 మందికి గాను 38,064 మందికి అందజేసినట్లు ఎంపీడీఓ నిర్మలా కుమారి తెలిపారు. బుక్కరాయసముద్రం మండలంలో 8,913 మందికి, నార్పల 7,589 మందికి, గార్లదిన్నె 6,630 మందికి, శింగనమల 5,538, పుట్లూరు 4,810 మందికి, యల్లనూరు మండలంలో 4,584 మందికి పంపిణీ చేశారని వివరించారు.

# ఉపాధి పనులు నాణ్యతగా చేయండి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ వేణుగోపాల్‌రెడ్డి

**పెద్దవడుగూరు:** ఉపాధి కూలీలు పనులను నాణ్యతగా చేయాలని డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జి.వెంకటాంపల్లిలో ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు సమయం తగ్గట్టుగా పని చేస్తే తగిన కూలీ వస్తుందన్నారు. చెరువు పూడిక తీత పనులను బాగా చేసుకుంటే వర్షా కాలంలో నీరు నిల్వ చేసుకోవచ్చని, తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. కూలీలకు ఎలాంటి సమస్యలు వచ్చినా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏపీడీ విజయ్‌కుమార్, ఏపీఓ పుల్లారెడ్డి, జయరామ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

**యల్లనూరు:** ఉపాధి హామీ పనులను నాణ్యతగా చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న, ఏపీఓ షబ్బీర్‌బాషా పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రతి పంచాయతీలో కూలీల హాజరు పెంచాలన్నారు. అనంతరం పనులను నాణ్యతగా చేయాలన్నారు. కార్యక్రమంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

**గుత్తి రూరల్:** జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ చిత్రా శ్రీనివాసులు సిబ్బందికి ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సీఎల్‌ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ ఆదినారాయణ, ఏపీఓ మద్దిలేటితో కలిసి ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాల లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. అలాగే కొలతల ప్రకారం కూలీ వచ్చేలా చూడాలన్నారు. వేసవిలో కూలీలకు మజ్జిగ, తాగునీరు, నీడ కల్పించాలని సూచించారు.

# మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుదాం


మాట్లాడుతున్న ఎంపీపీ బొంబాయి ఉమాదేవి.

**యాడికి:** ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి మండలాన్ని అభివృద్ధి పథంలో నడుపుదామని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా చూడాలని అధికారులకు తెలియజేశారు. అనంతరం వ్యవసాయ, ఉపాధి హామీ, ఉద్యాన, వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణం వైద్యం, అంగన్‌వాడీ, పంచాయతీ రాజ్, వైకేపీ, గ్రామీణ నీటి పారుదల శాఖ తదితర అధికారులు వారి శాఖల ప్రగతిని చదివి వినిపించారు. వ్యవసాయ సబ్సిడీ పరికరాలు కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ మహబూబ్‌బాషా కోరారు. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కొళాయి కనెక్షన్ 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయని గ్రామీణ నీటి పారుదల శాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్ దేవరాజ్ తెలిపారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ భవనాలను త్వరగా పూర్తి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హుసేనమ్మ తెలిపారు. సొంత ఇంటి స్థలం ఉన్న ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ప్రశాంత్ సూచించారు. సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించడంలేదని సభ్యులు సభ దృష్టికి ఆరోపించారు. అనవసరంగా మెడికల్ లీవ్‌పై వెళ్తున్న వారిపై మండల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీలు జమ్మలమడుగు హసీనాబేగం, చెన్నప్ప, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆర్డీటీ సేవలు ప్రశంసనీయం


మాట్లాడుతున్న హెచ్‌ఎం రాధాశ్రీదేవి

**పామిడి:** విద్య, వైద్య, ఆరోగ్యపరంగా ఆర్డీటీ సంస్థ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని హెచ్‌ఎం రాధాశ్రీదేవి అన్నారు. బుధవారం ఖాదర్‌పేట జెడ్పీ హైస్కూల్‌లో ఆర్డీటీ ఆధ్వర్యంలో స్పెయిన్ దేశస్తు సౌజన్యంతో రూ.8 లక్షల విలువ చేసే 141 సైకిళ్లను ఓబుళాపురం, దేవరపల్లి, అయ్యవారిపల్లి, ఇమాంపురం, అనుంపల్లి విద్యార్థులకు పంపిణీ చేశారు. సైన్స్ ల్యాబ్‌లో పరికరాల ఏర్పాటు కోసం రూ.35 వేలు ఆర్థికసాయం అందజేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలని హెచ్‌ఎం విద్యార్థులకు సూచించారు. ఆర్డీటీ ఆర్డీజీ నారాయణరెడ్డి, ఏటీఎల్ కే నాగరాజు, రీసర్చ్ అనాలసీస్ సామిత్రమ్మ, కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్వేత, ఉపాధ్యాయులు రామచంద్ర, లక్ష్మిరెడ్డి, కేశవరెడ్డి, రాధాకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం పట్టివేత

**గుత్తి:** పట్టణంలోని గోల్డెన్ కేఫ్ వద్ద మంగళవారం అర్ధరాత్రి పోలీసులు కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. సీఐ వెంకటరామిరెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి రూట్ వాచ్ చేపట్టారు. ఈసందర్భంగా పోలీసులను చూసి గోల్డెన్ కేఫ్ వద్ద ఇద్దరు వ్యక్తులు స్కార్పియో వాహనాన్ని వదిలేసి పరారయ్యారు. వాహనాన్ని చెక్ చేయగా అందులో 58 బాక్సుల కర్ణాటక టెట్రా ప్యాకెట్లు దొరికాయి.

## బాలామృతం వరం

**గుంతకల్లు రూరల్:** చిన్నారులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బాలామృతం పిల్లలకో వరం లాంటిదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి అన్నారు. బుధవారం అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు బాలామృతం పంపిణీ చేశారు. ఈసందర్భంగా కసాపురం, దోసలుడుకి, సంగాలలో పర్యటించిన సూపర్‌వైజర్ పుష్పావతి బాలామృతం వల్ల పిల్లలకు కలిగే లాభాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు.

## అక్రమ కట్టడం తొలగింపు

**గార్లదిన్నె:** రామ్‌దాస్‌పేట వద్ద 44వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో కాశిరెడ్డి నాయన ఆశ్రమం పేరుతో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాన్ని బుధవారం రెవెన్యూ అధికారులు, పోలీసులు కలసి తొలగించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ రామ్‌దాస్‌పేట సమీపంలో కల్లూరు అగ్రహారం పొలం 297 సర్వేనంబర్‌లో ప్రభుత్వ భూమి(గుట్ట)లో ఎలాంటి అనుమతులు లేకుండా కాశిరెడ్డి నాయన ఆశ్రమం ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక రైతులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో కట్టడాలు తొలగించామన్నారు.

## యాజమాన్య పద్ధతులు చేపట్టండి


వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏలు వెంకటరాముడు, శైలజ

**బుక్కరాయసముద్రం:** వేరుశనగ పంట సాగు చేసి 90 రోజులు కావస్తోందని, రైతులు యాజమాన్య పద్ధతులు చేపట్టాలని అనంతపురం ఏడీఏ వెంకటరాముడు రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ శైలజ తెలిపారు. బుధవారం రేకులకుంటలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వేరుశనగకు మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉందని, లక్షణాలు కనిపించిన వెంటనే హెక్సకొనాజోలు( కాంటాఫ్) 2 ఎంఎల్ , ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయాధికారులు శంకర్‌లాల్, శ్రీనివాసులు, ప్రవీణ్, రుహానబేగం పాల్గొన్నారు.

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

**గుత్తి రూరల్:** చెర్లోపల్లి పంచాయతీ సేవాగఢ్‌లోని మాతా జగదాంబ ఆలయంలో బుధవారం ధ్వజ స్తంభ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రధాన అర్చకుడు మారుతీప్రసాద్ ఆధ్వర్యంలో మాతా జగదాంబకు సుప్రభాత పూజ, మహాగణపతి పూజ, నవ కలశ స్థాపన, పంచ గవ్యప్రోక్షణ, అష్టదిక్పాలక పూజలు చేశారు. వేద పండితులు భారతీప్రసాద్, నరేష్ ఆచార్యాలు, పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సంత్ సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సంయుక్త కార్యదర్శి అశ్వత్థనాయక్, వర్కింగ్ అధ్యక్షుడు రవీంద్రనాయక్, కోశాధికారి బాలానాయక్, సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ తప్పనిసరి**

**గుంతకల్లుటౌన్:** పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న వాటి యజమానులను కోరారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మార్కెట్‌యార్డు ఆవరణలో గల పశువుల ఆస్పత్రిలో కుక్కలకు వ్యాక్సిన్ వేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ విషయమై ఎటువంటి సందేహాలున్నా వెటర్నరీ అసిస్టెంట్ వన్నప్ప 81792 70150 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

**వృద్ధులకు కంటి పరీక్షలు**

**పెద్దపప్పూరు:** తబ్జుల గ్రామంలోని రైతు భరోసా కేంద్రం ఆవరణలో డివిజన్ జీపీఎం ఓఓ మధుసూదన్ రాజు ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 20 మందికి ఆపరేషన్ల అవసరమున్నట్లు గుర్తించారు. వీరికి ఈ నెల 27 నుంచి 29వ వరకు మూడు రోజుల పాటు అనంతపురం శారదా నగర్‌లో సంచార నేత్ర వైద్యశాలలో కంటి ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్లు చిన్న కంబయ్య, సుధాకర్, ఆశా వర్కర్ శివలక్ష్మి పాల్గొన్నారు.

**ముందు జాగ్రత్తలతో వ్యాధుల నివారణ**

**నార్పల:** ముందు జాగ్రత్తలతో పశువుల్లో సంక్రమించే వ్యాధులను నివారించవచ్చని పశుశాఖ డీడీ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పశువులకు సక్రమించే గాలికుంటువ్యాధికి టీకాలు ఒక్కటే నివారణ మార్గమన్నారు. ఈనెల 31 వరకు మాత్రమే టీకాలు వేస్తామని, పాడిరైతులందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువైద్యాధికారులు రత్నకుమార్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

**గుండెపోటుతో వ్యక్తి మృతి**

**గుంతకల్లు రూరల్:** స్థానిక కసాపురం రోడ్డులోని వైన్ షాపులో సేల్స్‌మ్యాన్‌గా పని చేస్తున్న వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు...సత్యనారాయణ పేట కాలనీకి చెందిన మునిస్వామి (38) కసాపురం రోడ్డులో ఉన్న వైన్ షాపులో సేల్స్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో వైన్‌షాపులో ఉన్నట్టుండి కుప్పకూడి పడిపోయాడు. వెంటనే అక్కడున్న వారు అతడిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య సుకన్య ఉంది.

**అమరవీరులకు నివాళి**

**తాడిపత్రి:** ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు యర్రగుంటపల్లి వద్ద ఉన్న తెల్లబండ్ల రవి స్థూపం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం నివాళులర్పించారు. 1998లో ఎస్సీ వర్గీకరణ కోసం తెల్లబండ్ల రవి ప్రాణ త్యాగం చేశారని నాయకులు గుర్తు చేశారు. సీనియర్ నాయకులు పెద్దిరాజు మాదిగ, ఆదినారాయణ మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీబీ రవి, పట్టణాధ్యక్షుడు కరుణాకర్, యల్లనూరు మండలాధ్యక్షుడు మనోహర్, మహిళా నేతలు లక్ష్మీదేవి, దేవి, తులసి, నారాయణమ్మ పాల్గొన్నారు.